కథానిక

# బ్యాంక్ అకౌంటు

— మొవ్వ రాంబాబు

ఈ కథలో నిజాయితీ ఎంతవరకో నేను నిశ్చయంగా చెప్పలేను. ఎందువల్లనంటే నాకో స్నేహితుడు వాళ్ళ ఊరిలో ఈ విధంగా జరిగినట్లు నాకు చెప్పాడు. నా స్నేహితుడయినా అనవసరంగా అపోహలు కల్పించి చెప్పేరకం కాదు. పైగా అతనికి అందువలన ఏవిధమయిన ప్రయోజనమూ ఉండదు. మా స్నేహితుడు చెప్పిన విషయాలనే నేను మీకు తెలియ పరుస్తాను.

షావుకారు చలమయ్యగారికి మానవుల్లో అతిసామాన్యమయిన కోర్కె కలిగింది. తన వార్డు తరఫున స్థానిక మ్యునిసిపాలిటీకి పోటీ చేస్తున్నాడు. పోటీ ఏమంత ముఖ్యమయిన విషయం కాదు. "ఆ వెధవ నాతో పోటీచేస్తాడు! పైగా లేబరుపార్టీ తరఫున నిలబడ్డాను నాకు ఓట్లు ఇవ్వండి అంటాడు! చూస్తాను వీడి తఢాక ఎంతవరకో. ఈ వెధవకి ఒక్క ఓటు కూడా రాకుండా కొట్టకపోతే అప్పుడు నేను షావుకారు బసవయ్య కొడుకునే కాదు" అని శపథం చేయబట్టే షావుకారు చలమయ్య కొంచెం శ్రమపడి ఇంటి ఇంటికీ తిరిగి ఓట్లు అడగవలసి వచ్చింది. అప్పటికీ తన ఏజంట్లని చాలామందిని నియమించాడు. తనూ తిరుగుతూనే ఉన్నాడు ప్రతి ఇంటికీ, ఇప్పటికే గట్టిపడిన బొజ్జకు కష్టమనుకోకుండా. షావుకారు చలమయ్య బహు తెలివి గలవాడని ప్రసిద్ధి. పెద్ద బొర్ర. కొంచెము ఎత్తైన మనిషి. మనిషి చామనఛాయ, బొర్రమీసాలు. తెల్లటిచొక్కా లాల్చీలాంటిది తొడిగి, తెల్లటి మల్లుపంచ, పైన ఓ సిల్కు ఉత్తరీయం, చేతిలో సన్నని చేతికర్ర చాలా పెద్దమనిషిగా తయారవుతాడు ఎక్కడికయినా. వీటిలో ఏఒక్కటిఅయినా లేకుండా అతడు బయటకువచ్చి ఎరగడు. చలమయ్యకు ఊళ్లో ఒక కమీషనుకొట్టున్నది. ఈప్రాంతంలోకల్లా గొప్పదని పేరుపొందిన సినిమా హాలు అతనిదే. డబ్బనేది వచ్చేవాళ్ళకు అట్లా వస్తుంది. ఆయనకు ఇళ్ళమీద నెలకు అద్దెలు రెండు మూడు వందలు వస్తాయంటే అతిశయోక్తి ఏమీలేదు. పైగా రెండువందల ఎకరాల మాగాణి నిక్షేపంగా ఉన్నది. ఇంకా ఏమికావాలి చెప్పండి? ఇన్నాళ్ళనుండి ఈ కౌన్సిలర్సు అంటే యేమిటో అతని దృష్టిని ఆకర్షించలేదు. ఒక స్నేహితుడితో మాటలమీద మాటవచ్చి "ఈ తడవకి వైస్ ఛైర్‌మన్ అన్నా అవకపోతే నీ కాలిక్రిందగా దూరతారా" అని అనటంవల్ల అసలు మ్యునిసిపాలిటీవ్యవహారాల్లోకి దిగవలసివచ్చింది.

ప్రతి ఇంటికీ తిరిగి ఓటు అడిగే సందర్భంలో అతని దృష్టి సులోచనమీద పడింది. తనకు కొంచెం వయస్సు మళ్ళినా తను కొంచెం అందవికారంగా ఉన్నా ఆ లోట్లన్నిటినీ అతని హోదా డబ్బు తీర్చగలవని అతని నమ్మకం. సులోచనని ఎట్లా లోబరచుకొన్నాడో అన్నది ఏమంత ముఖ్యమయిన విషయం కాదు. సులోచన వాళ్ళ అత్తదగ్గర ఉంటూంది. చెలమయ్యగారికి అంతరంగిక సెక్రెటరీ లాంటివాడు ఒకడు ఉన్నాడు. వాడు సులోచన వాళ్ళ అత్తకి డబ్బులు ఎరచూపించాడు. పైగా వాళ్ళ షావుకారు ఈ మధ్య సినిమాలు తీయటానికి సంకల్పించారని ఈ ఎలక్షన్సు అయిపోంగానే సినిమా ఒకటి మెడ్రాస్‌లో తీస్తారని సౌందర్యవతి అయిన సులోచనకి అందులో మంచి ఛాన్సులుంటవని ఇంకా అనేకమయినవి చెప్పాడు. పైగా ఆమెకి కూడా జరుగుబాటు కొంచెం కష్టంగా ఉండిఉంటుంది. షావుకారు చలమయ్యలాంటి ధనికుడితో స్నేహితం పైగా చుట్టరికం ఎందుకయినా చాలా మంచిదని సులోచనని ఒప్పిం

చింది. ఆమె ఇవి అన్నీ సులోచనకి చెప్పంగానే "మదమెక్కిన మూర్ఖుడు" అన్నది సులోచన. మదమెక్కిన మూర్ఖుడయితే ఇంకా ఏమయినా అయితే ఏం? మనికి డబ్బులిస్తాడు. రేపు సినిమాలు తీస్తే నిన్ను పైకి తీసుకొస్తాడు" అన్నది.

చలమయ్యగారి అంతరంగిక సెక్రటరీ గుఱ్ఱపు బండి ఒకటి తీసుకొచ్చి సులోచన వాళ్ళ ఇంటి ముందు ఆపాడు.

లేత గులాబి రంగు చీర, నల్లటి బ్లౌజు, కాళ్లకు చెప్పులు వేసుకొని సౌందర్యాన్ని అంతా ఒలకపోస్తున్నట్లు సులోచన వచ్చి బండిలో కూర్చుంది. ఇదే విధంగా కొలది రోజులు జరిగిపోయినతర్వాత తన ఇంటికి కొద్ది దూరంలోనే ఒక ఇల్లు కొనివేశాడు చలమయ్యగారు. సులోచన దానిలోనికి మార్చింది నివాసాన్ని. సులోచన కొరకు ఎంత డబ్బు అయినా ఖర్చుపెడుతున్నాడు. ఆమెకు చాలా ఆభరణాలు ఇంట్లోకి అనేకమైన సామానులు ఇత్యాదులు చాలా ఖరీదుగలవి అనేకం తెచ్చాడు. సులోచన వీటి అన్నింటికి అలవాటుపడింది. కాని నెమ్మదిగా చలమయ్యగారు ఇస్తున్న డబ్బును పొదుపుగా వాడుకొని కొద్దికొద్దిగా మిగుల్చుకొనేది. సులోచన ఇంటికి ఎవ్వరూ రాకుండా కట్టుదిట్టాలు చేశాడు చలయమ్యగారు. తెలివిగల మనిషి కాబట్టి అనేకమైన విషయాలు చేస్తుంటాడు. సులోచన ఒంటరిగా ఉంటుంది కనుక చలమయ్యగారు లేని సమయాల్లో ఆమె బుద్ధి అనేక రకాలుగాపోవచ్చు. ఈ విధంగా కట్టుదిట్టం చేసుకున్న తర్వాత వారి హృదయం శాంతించింది.

సుఖంగా గడుపుతున్నాడు రోజులని. ఈ ఎలక్షన్సు రావటం తనకి సులోచనకి పరిచయమవటం. ఆమె ఎంత బాగుంటుంది? అందానికి అందమూ, సరళ హృదయం గలది. సంతోషాన్ని ఇస్తుంది. సులోచన ఎంత మంచిది?

* * *

ఒక పర్యాయం చలమయ్యగారు మద్రాసుకు పోయి తిరిగివస్తూ సరాసరి సులోచన ఇంటికే వచ్చేటప్పటికి తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు.

"ఎక్కడనుండి ఊడిపడ్డారు ఎల్లుండిదాక రానన్నారు గదూ" అన్నది. చలమయ్యగారు పళ్లు బిగబట్టి "వాడు ఎవడు" అన్నాడు ఆ గదిలో ఉన్న యువకుని చూపిస్తూ. ఆ యువకుడు చలమయ్యగారు ఇంత తొందరగా రావటం చూచి బిత్తరపోయి నిల్చుని ఏమి ప్రమాదం జరుగుతుందోనని సులోచనవంక చూస్తున్నాడు.

"నా ప్రియుడు" అన్నది.

"నీ ప్రియుడని తెలుస్తూనేవుంది" అరిచాడు చలమయ్య.

"మరి అయితే ఎందుకు అడగటం?"

చలమయ్యగారికి కోపం పెరిగిపోయింది. కళ్లు ఎర్ర బడినవి. క్రోధంచేత మొఖం కందిపోయింది. చొక్కా చేతులు పైకితీసి సులోచన చెంపమీద ఒకటి పెఢేలున వడ్డించాడు.

"జంతువు" అని అరుస్తూ ఆమె నేలమీదకి ఒరిగింది. చలమయ్యగారి దృష్టి మళ్ళా ఆ యువకుని వైపు తిరిగింది. అతన్ని కొట్టబోయే వాడికిమల్లె చేతులు పైకెత్తి "ఎవగవురా నీవు గాడిదకొడక" అని అరుస్తూ అతన్ని ఒకటి వేయబోయ్యాడు. ఆ యువకుడు ఆ దెబ్బ తప్పించుకొని తన చెప్పులు చేతులోనికి తీసుకొని బయటికి ఉడాయించాడు.

కొద్దిసేపయినతర్వాత చలమయ్యగారికి కోపం తగ్గింది. ఆమె అట్లా మోసం చేసినందులకు ఎన్నోవిధాల తిట్టాడు. పెద్దమనిషిని అట్లా మోసం చేయటం ఆడదానికి తగినపని కాదన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. అతను అంటున్నదానిని ఖండిచటానికి ప్రయత్నించనేలేదు. నోటికి ఎన్నిమాటలు రావాలో అన్ని మాటలు అన్నాడు. ఆమె అంతా పూర్తి కానిచ్చి నెమ్మదిగా లేచింది.

"మీరు చూస్తే భోజనం తీసుకొన్నట్లుగా లేదు. కొన్ని నిమిషాలల్లోనే తయారు చేస్తాను. ఇక్కడే కూర్చోండి" అని అన్నది ఇంట్లోకి వెళ్లుతూ.

"నాకు నీకూడు అక్కరలేదు. నేను మ్యునిసిపల్ ఛేయిర్‌మన్ అయ్యానని సంతోషకరంగా నీకు చెప్పటానికని స్టేషనునుండి సరాసరి ఇక్కడకువస్తే నీవు..." అంటూ ఆపివేశాడు.

ఆమె బలవంతాన భోజనం తినిపిస్తూంది.

భోజనంచేస్తూ ఆమె నెమ్మదిగా నేలవంక మాట్లాడకుండా చూస్తూంది. అతను మళ్ళా,

"ఇంకా నయం! తొందరలోనే తెలుసుకొన కలిగాను. రేపువచ్చే దసరాకి నీకు ఇరవయివేల రూపాయలు నీపేర వ్రాద్దామనుకుంటున్నాను. నా కేమయినా జరిగే పక్షంలో నీవు హాయిగా బ్రతకటానికి. ఇంతకీ నీనోట శని కాబట్టి నీ రంకుతనాలన్నీ ఈవాళ బయట పడ్డవి" అన్నాడు.

ఆమె ఒక్కమారుగా ఇరవయివేలరూపాయలే అన్నది.

"అవును. ఇరవయివేల రూపాయలు. ఇంతకీ నీనోట శని" అని మళ్ళా అన్నాడు.

చలమయ్యగారికి కోపం పాంతంగా తగ్గిందని చెప్పవచ్చు.

"ఐతే ఇరవయివేల రూపాయలు ఇవ్వండి. అతన్ని రేపే పెండ్లి చేసుకుంటాను" అన్నది.

"అంటే దాని అర్థం?"

"దాని అర్థం తర్వాత తెలుస్తుంది కాని, నేనంటే మీకు ఇష్టంలేదా?" అన్నది.

"ఇదివరకు ఇష్టమే ఇంక ఇప్పుడు ఎట్లా?" అన్నాడు.

"మానవుడన్నాక ఒక్క లోపమన్నా లేకుండా ఎవ్వరూ ఉండరు. నేనంటే మీకెంత ఇష్టమో అతనంటే నాకంత ఇష్టం. నేను బీదపరిస్థితుల్లో ఉన్నప్పుడు ధన సహాయం చేశారు. మీ సుఖాన్ని తీర్చుకుంటున్నారు. అందులో మీ తప్పు ఏమీలేదు. నేనంటే ఎంతో దయతోను సహాయంగాను ఉంటున్నారు. మీరన్నా నాకు ఇష్టమే. ఆ యువకుడన్నా ఇష్టమే. మీరంటే నాకు ఇంకా అభిమానంకూడా. మీరు ఆస్తిపరులే కాకుండా పెద్దమనుష్యులు, ఉదారులు కాని అతడు యువకుడు. యువకుడు" అని అంది.

చలమయ్యగారు తినబోయే ముద్దని ఆపి పళ్లెంలోనికి చూశాడు. కళ్లల్లో నీరు తిరిగినవి.

"అవును. నేను యువకుణ్ణి కాదు. కాని నీ స్నేహితుడుకి కూడా నా వయస్సు వస్తే పొట్ట పెరుగుతుంది, బట్టతలవుతుంది" అన్నాడు

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"అతను ముసలతను అయినప్పుడు నేనూ ముసలిదాన్నవుతాను. అప్పటి సంగతి ఇప్పుడెందుకు? నేను మీకెంత కావాలో నాకతనంత కావాలి. పైగా అతనికి ఒక దమ్మిడీలేదు. ఒక ఇల్లులేదు. అతనికి కావలసినవి ప్రత్యేకించి ఏమీలేవు. మీరు రోజూ సాయంత్రం పనులు అన్నీ చూచుకొని ఇక్కడకు రాకపోతే మీ కెంత కష్టమో వారానికి అతన్ని ఒక్కసారయినా చూడకపోతే నాకంత కష్టం" అన్నది.

చలమయ్యగారి భోజనం పూర్తిఅయింది. గదిలో సోఫాలో కూర్చున్నాడు. దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాడు.

"ఏమయినప్పటికీ నీవు ఇంత మోసం చేస్తావని నేను కలలో కూడా అనుకోలేదు" అన్నాడు.

మీరు సరిగ్గా ఆలోచించండి. మోస మెంత వరకో మీకే తెలుస్తుంది" అన్నది.

"ఏమిటి తెలిసేది?"

"మనుష్యులంతా బహు గమ్మత్తుగా ఉంటారు. మీ తెలివితక్కువ తనాన్ని బయట పెడుతున్నా గ్రహించరు. అనవసరమయిన విషయాలను గురించి కూడా బుర్ర బద్దలు చేసుకుంటారు" అన్నది సులోచన.

"అయితే నీవు నాఇంట్లో పరాయివాడితో కూర్చుని ఉంటే ఇది అంతా నాకు అనవసరమంటావా?"

"మరి అయితే అతనే నా భర్తఅయి మీతోనే నేను మాట్లాడుతున్నప్పుడు మీరు దానిని సహజంగా తీసుకోరా? మీరు ప్రతిచిన్న విషయానికి గల్లంతుచేయటం ఏమి బాగులేదు. కాబట్టి మీకు సంతోషం కలిగించటానికే అతనిని పెండ్లి చేసుకుంటాను. అప్పుడు అంతా సహజంగా ఉంటుది. మీకూ సంతోషంగా ఉంటుంది" అన్నది నవ్వుతూ.

ఒక నిమిషంవరకూ చలమయ్యగారికి అర్థం కాలేదు. మెరపువలె మెరసిన విషయాన్ని అర్థం చేసుకోగానే చిరునవ్వుతో ఆమె మొఖం చూశాడు.

మరుసటి రోజుకల్లా సులోచనపేర ఇరవయివేలకి బ్యాంకి అకౌంటు తెరువబడివున్నది.